క్లుప్తంగా

పెనుగంచిప్రోలులో 98.34 శాతం పింఛన్ల పంపిణీ



పెనుగంచిప్రోలు: మండలంలో శనివారం నాటికి సామాజిక పింఛన్ల పంపిణీ 98.34 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్పీ ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 8,401 మంది పింఛన్‌దారులు ఉన్నారు. మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన బోగి యమీనా అనే వలంటీర్ విజయవాడలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరి కోటేశ్వరరావుకు అక్కడికి వెళ్లి మరీ పింఛన్ అందజేసింది.

7 నుంచి వత్సవాయమ్మ అమ్మవారి తిరునాళ్లు



వత్సవాయి: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ రామ జగపతి దేవసమేత వత్సవాయమ్మ అమ్మవారి తిరునాళ్లు ఈ నెల 7వ తేదీ నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ రాత్రి శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తిరుకల్యాణం, 8వ తేదీ మధ్యాహ్నం జలబిందెల కార్యక్రమం, రాత్రి అంకోసేవ, 9 వ తేదీ మధ్యాహ్నం లగుడు పాడుచుట, రాత్రి పూలకప్పెర ఊరేగింపు, 10న పొరుగూరి బోనాలు, రాత్రి గ్రామరాశి ప్రభ ఊరేగింపు, చివరి రోజు 11 న ఉన్న ఊరి బోనాలు, రాత్రి దీవెన బండారు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వైకుంఠరావు ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోతే కేసు నమోదు



నందిగామ: వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే కేసు నమోదు చేస్తామని ఎస్‌హెచ్‌ఓ సతీష్ హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ సెంటర్ లో శనివారం రాత్రి వాహన తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న పలు ద్విచక్ర వాహనాల యజమానులను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపైన తిరిగే ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం రోడ్డు మీదకు వస్తే సీజ్ చేస్తామన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. కొందరు మైనర్లకు వాహనాలు ఇస్తున్నారని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో సీఐ వెంట ఎస్‌ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 12మంది యువకులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి శాంతినగర్‌లో ఓ యువకుడి పుట్టినరోజు వేడుకల పేరుతో అర్ధరాత్రి హంగామా సృష్టించిన 12 మంది యువకులు, ముగ్గురు మహిళలను శుక్రవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెస్ట్‌జోన్ ఏసీపీ హనుమంతరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వారి వద్ద నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి గంజాయి తెచ్చిన కిషోర్ అనే యువకుడు పరారయ్యాడు. ముగ్గురు మహిళలు వంట నిమిత్తం వచ్చినట్లు విచారణలో తేలగా వదిలివేసినట్లు తెలిపారు. పరారైన కిషోర్ ఆచూకీ లభిస్తే గంజాయి వివరాలు తెలుస్తాయన్నారు. గంజాయిపై యువకులను విచారించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సీఐ పి.శ్రీను, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

18న బాలోత్సవం

తిరువూరు: తిరువూరులో ఈ నెల 18వ తేదీన బాలోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, ఆహ్వాన కమిటీ సభ్యులు పాపారావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం అవుతున్న వేళ!

- నందిగామ నియోజకవర్గంలో 127 జగనన్న లే అవుట్‌లు
- మొత్తం 9,232 మందికి ఇళ్లు మంజూరు
- శరవేగంగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- ఆనందంలో లబ్ధిదారులు



కంచికచర్లలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కంచికచర్ల: దశాబ్దాల తరబడి సొంత గూడు లేక అవస్థలు పడుతున్న నిరుపేదల కల వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సాకారమవుతోంది. లబ్ధిదారులకు త్వరలో సొంతిల్లు సమకూరనుంది. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోతోంది. నందిగామ నియోజకవర్గంలో 127 జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల స్థలం ఉచితంగా కేటాయించటంతో పాటు 9,232 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇళ్లు మంజూరయిన అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు చక చకా సాగుతున్నాయి.

ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల మంజూరు

వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లతో పాటు సొంత స్థలం కలిగి ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేయటమే కాకుండా ప్రభుత్వం ఇల్లు కట్టుకునే లబ్ధిదారులకు ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఇల్లు కట్టుకునే వారికి సిమెంట్, ఇనుము రాయితీ ధరపై ప్రభుత్వం ఇస్తుందని, ఇసుక ఉచితంగా సరఫరా చేసుకునేందుకు కూపన్లు ఇస్తోందన్నారు.



గండేపల్లిలో దాదాపుగా పూర్తయిన ఇళ్లు

మండలాల వారీగా ఇళ్ల మంజూరు

నియోజకవర్గంలో మండలాల వారీగా కంచికచర్ల మండలంలో 2,875 మందికి, నందిగామ మండలంలో 1,262 మందికి నందిగామ అర్బన్‌లో 1,217 మందికి, చందర్లపాడు మండలంలో 2,136 మందికి, వీరులపాడు మండలంలో 1,742 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. లే అవుట్లలో కాకుండా సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి కూడా ఇళ్లు మంజూరు చేశారు. అన్ని హంగులతో సొంతింటి కల నెరవేరుతుండటంతో లబ్ధిదారులు పట్టరాని సంతోషంగా ఉన్నారు. లబ్ధిదారుల కోరిక మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, సకాలంలో బిల్లులు కూడా చెల్లిస్తున్నామని నందిగామ ఇన్‌చార్జి హౌసింగ్ డీఈఈ ఆకుల నరసింహారావు తెలిపారు. గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పట్టరాని ఆనందంగా ఉంది



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం చాలాసార్లు దరఖాస్తు చేసి విసిగిపోయా. జగనన్న అధికారంలోకి వచ్చాక మళ్లీ దరఖాస్తు చేశా. ఇల్లు మంజూరయిందని గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ ఇంటికి వచ్చి చెబితే నమ్మలేక పోయా. సొంతింటి కల నెరవేరుతుండటంతో పట్టలేనంత ఆనందంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటా.

– సంగం త్రివేణి, గండేపల్లి, కంచికచర్ల మండలం

సొంతింటి కల నెరవేరింది



ఇళ్ల స్థలం కోసం గతంలో జన్మభూమి కార్యక్రమాల్లో అనేక సార్లు అర్జీలు చేశా. ఫలితం లేకుండా పోయింది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేశా. స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇల్లు కట్టుకుని గృహ ప్రవేశం కూడా చేశాం. సొంతింటి కల నెరవేరటంతో సంతోషంగా ఉంది.

– సవరం వరలక్ష్మి, గండేపల్లి గ్రామం, కంచికచర్ల మండలం

పోటీ పరీక్షలకు గ్రంథాలయం దోహదం



గ్రంథాలయాధికారి, పాఠకులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆదివారం ఆవిష్కరించనున్న తన తండ్రి సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడకు సమీపంలో ఉన్న గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, పాఠకులు ఎమ్మెల్యే ఉదయభానును కలిశారు. గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని గ్రంథాలయాధికారిని ఎమ్మెల్యే అడిగారు. కొరత ఉంటే వెంటనే సమకూర్చుకోవాలని సూచించారు. ఇటీవల పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

నేడు సామినేని విశ్వనాథం విగ్రహావిష్కరణ

మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు రాక

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మాజీ సర్పంచ్, దివంగత సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేసిన విశ్వనాథం విగ్రహం, పార్కు నిర్మాణ పనులను శనివారం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పలువురు పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 ఏళ్లు జగ్గయ్యపేట సర్పంచ్‌గా పనిచేసిన సామినేని విశ్వనాథం విగ్రహాన్ని, గ్రీనరీ, వాటర్ ఫౌంటెయిన్‌తో కూడిన మినీ పార్కును ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఆయన మనుమడు, కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణప్రసాద్ ఆర్థిక సహాయంతో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించినట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రానున్న ప్రముఖులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధ్యక్షతన ఆదివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తోట త్రిమూర్తులు, మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు, నందిగామ, మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహనరావు, వసంత కృష్ణప్రసాద్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్, పేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అతిథులుగా రానున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఆవిష్కరణకు సిద్ధమైన సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహం, మినీ పార్కు (ఇన్‌సెట్) సర్దార్ సామినేని విశ్వనాథం(ఫైల్)

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ: అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని ఆర్డీవో రవీంద్రరావు సూచించారు. నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టిక ఆహారాన్ని మెనూ ప్రకారం అందజేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సంబంధించిన ఆరోగ్య పరిస్థితులు, బరువుకు సంబంధించిన అంశాలు ఎప్పటికప్పుడు సిబ్బంది రికార్డులో నమోదు చేయాలన్నారు. చిన్నపిల్లలను తప్పనిసరిగా ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులకు సూచించారు. ఆయన వెంట పలువురు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన రామకోటి మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో 70 వ రామకోటి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రమా సహిత సత్యనారాయణ స్వామి వారి వ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత నారాయణ సేవ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతులను వినియోగించుకోవాలి

వీరులపాడు: ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులు వినియోగించుకుని శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. మండలంలోని జుజ్జూరు, జగన్నాధపురం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠ్య ప్రణాళికలు, రికార్డులను తనిఖీ చేశామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు బుజ్జి, రవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న మహాలక్ష్మి అమ్మవారి జయంతి మహోత్సవం

జగ్గయ్యపేట అర్బన్: శ్రీమహాలక్ష్మి అమ్మవారి జయంతి మహోత్సవం ఈనెల 7 వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం ఇంప్రూవ్‌మెంట్ ప్రైవేటు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 7వ తేదీ ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం, పూలాభిషేకం జరుగుతుందన్నారు. అనంతరం 9 నదుల పవిత్ర జలాలతో నింపిన 108 కలశాలు, గోక్షీరంతో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. చండీ మూలమంత్ర హవన సహిత పంచసూక్త రుద్రహోమం జరుగుతుందన్నారు. అనంతరం 10 గంటలకు 11రకాల పూలతో పుష్పయాగం, సామూహిక పారాయణం, కుంకుమార్చన జరుగుతుందన్నారు. ఆలయ గౌరవ సలహాదారు భగవద్రామానుజ గోష్ఠి వ్యవస్థాపకుడు టీఎల్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ జొన్నాభట్ల కిషోర్‌శర్మ, అర్చకులు పరాంకుశం రామకృష్ణమాచార్యులు నిర్వహించనున్నారు.

తల్లిదండ్రులకు పాదాభిషేకం



తల్లిదండ్రులకు పాదాభిషేకం చేస్తున్న విద్యార్థులు

నందిగామ: బంధాలు, బాంధవ్యాలు బలహీనపడుతున్న నేపథ్యంలో విద్యార్థులకు బంధాల విలువ గుర్తు చేసేందుకే ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గుత్తా ప్రదీప్ అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు తల్లిదండ్రులకు పాదాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అతిథులు మాట్లాడుతూ కుటుంబం అంటే కేవలం తల్లి, తండ్రి, పిల్లలు మాత్రమే కాదని పెద్దల తల్లిదండ్రులు కూడా మన కుటుంబంలో భాగమేనని సూచించారు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని గుర్తు చేశారు. కరోనా తరువాత బంధాలు బాంధవ్యాలు మరింత బలహీనపడ్డాయని ఈ తరుణంలో కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు కోళ్లు, పొట్టేళ్లు అందజేస్తున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శనివారం పెరటి కోళ్లు, పొట్టేళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళల కోసం వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు పెరటి కోళ్లు, పొట్టేళ్లు అందిస్తున్నామన్నారు. మండలానికి 60 యూనిట్‌ల పెరటి కోళ్లు, 20 యూనిట్‌ల పొట్టేళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు దారావత్ శ్యామల, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు, ఏపీడీ వెంకటేశ్వరరావు, సీసీలు, ఏవోలు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు

రైతులకు రూ.1.31 కోట్లకు టోకరా

నందిగామ: పలువురు రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి రైతులకు నగదు చెల్లించకపోవడంతో నందిగామ పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం గుంటూరుకు చెందిన శ్రీరామ్ ట్రేడర్స్ యజమాని నందిగామ మండలం పెద్దవరం పరిసర ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేశాడు. రైతులు విక్రయించిన మిర్చికి సంబంధించి వారికి చెల్లించవలసిన రూ.1.31 కోట్ల నగదు చెల్లించకపోగా, కనిపించకుండా తిరుగుతున్నాడు. బాధిత రైతుల ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

వీటీపీఎస్ స్టోర్‌పై అసత్యాలు నమ్మవద్దు

ఇబ్రహీంపట్నం: వీటీపీఎస్ ఆఫీసర్స్ కన్జూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్, ఆటోకేర్ సెంటర్ (పెట్రోల్ బంక్)లో అవకతవకలు జరిగాయని కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన అసత్య ప్రచారాలను ఖండిస్తున్నట్టు పాలకవర్గం కమిటీ అధ్యక్షుడు జీఆర్ఎస్‌వీకే అప్పారావు, కార్యదర్శి యు.నాగాంజనేయులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విజయవాడ విభాగ సహకార శాఖ అధికారి పి.కిరణ్‌కుమార్ శాఖాపరమైన దర్యాప్తు చేయాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీహర్షను నియమించారని పేర్కొన్నారు. విచారణ పూర్తయిన అనంతరం అవకతవకలు బయటపడితే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పెండ్యాల ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీపీ మలక్‌బషీర్

పెండ్యాల(కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అన్నారు. మండలంలోని పెండ్యాల ఎంపీపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలకు వచ్చే విద్యార్థుల హాజరుపట్టీని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తయారు చేసే వంటశాలలకు వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆంగ్లభాష నేర్చుకునేలా మంచి నాణ్యమైన విద్యనందిస్తున్నారన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని లేకపోతే వంట ఏజెన్సీలను రద్దు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్రితసాయిలో ప్రాంగణ ఎంపికలు



కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకు చెందిన ప్రముఖ కంపెనీ స్టాన్ డైన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహించిందని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి బి.రామారావు శనివారం తెలిపారు. కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారని, వారిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 17మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఎంపికయిన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2లక్షలుగా నిర్ణయించి నియామక పత్రాలు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శశిధర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రకటన

[illegible] M/s. Shriram Finance Ltd. [illegible]

రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820, Enrolment Number: 1370/1967

అనధికారిక వెంచర్ల తొలగింపు



అంబారుపేట సమీపంలోని వెంచర్‌ను ధ్వంసం చేస్తున్న అధికారులు

నందిగామ: అనుమతులు లేని వెంచర్లలో స్థలాలు కొని మోసపోవద్దని సీఆర్‌డీఏ అధికారులు సూచించారు. నందిగామ మండలం అంబారుపేట సమీపంలో 65 వ నంబర్ జాతీయ రహదారి పక్కనే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌ను శనివారం సీఆర్‌డీఏ అధికారులు ధ్వంసం చేశారు. వెంచర్ లోని రహదారులను పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ అధికారులు మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా వెంచర్‌లు వేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమతులు లేని వెంచర్‌లలో స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని వినియోగదారులకు సూచించారు. సంబంధిత వెంచర్ల యజమానులకు అనుమతులు తీసుకోవాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా కూడా పట్టించుకోలేదని, ఈ నేపథ్యంలో వెంచర్‌ల లోని రహదారులను తొలగించామన్నారు. అనుమతులు లేనివి నందిగామ ప్రాంతంలో మరికొన్ని ఉన్నాయని, సంబంధిత వ్యాపారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని చెప్పారు.

బ్రహ్మోత్సవాలలో సాంస్కృతిక ప్రదర్శనలు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆరురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు. ఈ నెల ఐదో తేదీన విజయవాడ నటరాజ నృత్య కళానిలయం బృందంచే భరత నాట్యం, వెల్లంకి డ్యాన్స్ అకాడమిచే కల్చరల్ డ్యాన్స్ ప్రోగ్రాం, ఆరో తేదీన ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ చే పాటలు, పద్యాలు, భగవద్గీత, శ్లోకాలు, వైరాకు చెందిన వెంకట్ డ్యాన్స్ అకాడమీచే కల్చరల్ డాన్స్ ప్రోగ్రాం, ఏడో తేదీన నాట్య కిరణ్ ఎ.రిషిశ్రీ చే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8న తిరువూరు గోదా నరసింహారావు బృందంచే భక్తి రంజని కార్యక్రమం, ఖమ్మం ఫైర్ రవి కళాబృందం వారిచే ఫైర్ డ్యాన్స్ మ్యాజిక్ మిమిక్రి, టాకింగ్ డాల్, భక్తి పాటలు, పేరడి పాటలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 9న విజయవాడ మాధురి ఆర్కెస్ట్రాచే భక్తి గీతాలాపన, గూడవల్లి శివరంజని నాట్యమండలిచే శ్రీ కృష్ణార్జున గయోపాఖ్యానం, బ్రహ్మంగారి దివ్య చరిత్ర సత్యహరిశ్చంద్ర నాటకాలు, 10న జగ్గయ్యపేటకు చెందిన జీవీఎల్ నరసింహారావుచే ముకుందా–ముకుందా భక్తిగీతాలు, తిరువూరుకు చెందిన మహాలక్ష్మి కళాబృందంచే సినీ హాస్యవల్లరి, మిమిక్రి, మెజీషియన్, ఫైర్ డ్యాన్సులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

జి.కొండూరు: మండలంలోని వెల్లటూరు రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధన, భేరీపూజ, బలిహరణ, ధ్వజారోహణ, నిత్యహోమం, పెండ్లి కుమారుని చేయుట, విశేషార్చన, ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం నవకుంభారోహణ, నిత్యహోమం, ఎదురుకోల మహోత్సవం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.